నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 18: టీఎస్ఎస్పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ చెన్నారెడ్డినగర్, బాపూనగర్, సీపీఎల్, ప్రేమ్‌నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా మంగళవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చెన్నారెడ్డి నగర్ ఫీడర్ పధిలోని న్యూపటేల్‌నగర్, మహ్మద్‌నగర్, పోచమ్మబస్తీ టెంపుల్, సమోస కార్ఖానా, బిమిల్లా హోటల్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు బాపూనగర్ ఫీడర్ పరిధిలోని బాపూనగర్, ఒవైసీనగర్, నెక్లెస్ హోటల్, ఆకాశ్‌నగర్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 వరకు సీపీఎల్ ఫీడర్ పధిలోని పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్, పటేల్‌వాడ, సీపీఎల్ క్వార్టర్స్ పరిసరాల్లో కరెంట్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రేమ్‌నగర్ ఫీడర్ పధిలోని ప్రేమ్‌నగర్, పటేల్‌నగర్ చౌరస్తా, హనుమాన్ టెంపుల్, సుందర్‌బౌలి జంక్షన్, ఉదయం స్కూల్, బీజేపీ జెండా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

లష్కర్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బేగంపేట్, నవంబర్ 18: విద్యుత్ లైన్లలో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ కారణంగా నేడు (మంగళవారం) సికింద్రాబాద్ ప్యారడైజ్ ఏఈడీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతు చేపడుతున్నట్టు ఎలక్ట్రిసిటీ అధికారులు తెలిపారు. క్లాక్‌టవర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం విధిస్తున్నట్టు చెప్పారు. స్టేషన్ రోడ్డు ఫీడర్ పరిధిలోని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీనిధి జనతా, హెచ్‌పీ పెట్రోల్ పంపు, సెయింట్ ప్యాట్రిక్ స్కూల్, నాగార్జున హెల్త్ సెంటర్, రెజిమెంటల్‌బజార్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు. అలాగే నటరాజ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5వరకు మార్గదర్శి చిట్‌ఫండ్స్, చెన్నై షాపింగ్ మాల్, ఆంధ్రాబ్యాంక్ ఏటీఎం ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నారు. మినర్వా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళానికేతన్, కళాసీగూడ, ఎస్డీ రోడ్డు, స్వప్నలోక్ కాంప్లెక్స్, మంజు టాకీస్ ఏరియా, సెయింట్ మేరీస్ చర్చి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్టు అధికారులు తెలిపారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

బాకారం వెస్లీ చర్చి ప్రాంతంలో పర్యటిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబర్ 18: రాంనగర్ డివిజన్ బాకారం వెస్లీ చర్చి ప్రాంతంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జలమండలి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జలమండలి అధికారులతో కలిసి వెస్లీ చర్చి ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, స్థానికులు డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మురుగు నిత్యం రోడ్డంతా పరుచుకొని పారుతుందని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే నూతన పైపులైన్ వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదిక నిధులు కేటాయించి పనులు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శంకర్ ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ముదిగొండ మురళి, నవీన్, అరుణ్, వెంకటేశ్, సీఎస్ఐ వెస్లి చర్చి కమిటీ సభ్యులు బీజే థామ్సన్, కె.జయారావు, సునీల్, ఎస్‌కే సైమన్, కరుణానందం, మైకెల్ ప్రసన్న, విజయ్‌కుమార్, కె.జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై అవగాహన కల్పించాలి


విద్యార్థులతో కలిసి క్రీడల్లో పాల్గొన్న కార్పొరేటర్ శైలజ, తదితరులు

సికింద్రాబాద్, నవంబర్ 18: క్రీడలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని బౌద్ధ నగర్ కార్పొరేటర్ శైలజ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థుల కోసం స్పోర్ట్స్ రూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులకు క్రీడా సామగ్రిని ఉచితంగా అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆటలు ఆరోగ్యంతో పాటు మనోవికాసాన్ని ఇస్తాయని, ప్రతిరోజు గంట పాటు విద్యార్థులకు ఆటలు ఆడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ నూతన ఓఎస్డీ ప్రొ.జితేందర్‌కు సన్మానం

నూతన ఓఎస్‌డి ప్రొ జితేందర్ కుమార్‌ని సన్మానిస్తున్న పలువురు డాక్టర్లు

సికింద్రాబాద్, నవంబర్ 18: ఓయూ ఓఎస్డీగా నియామకమైన ప్రొ.జితేందర్‌కుమార్‌ను పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జితేందర్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, విభాగ అధిపతిగా అనేక పరిపాలన విభాగాల్లో పనిచేశారు. ఓయూ ఓఎస్డీగా నియామకం కావడం శుభ పరిణామమని డా.కొర్ర ఈశ్వర్‌లాల్ అన్నారు. ఈ సందర్భంగా ఓయూ పరిపాలన విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డా.రమేశ్ రాథోడ్, డా.పోతురాజు వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జోషి కాంపౌండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, నవంబర్ 18: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని జోషి కాంపౌండ్ ప్రాంతంలో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సీతాఫల్‌మండి డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద స్ట్రామ్ వాటర్ లైన్ పనులను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు పనులు త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జోషి కాంపౌండ్‌లో ఎలక్ట్రిసిటీ పోల్ డ్యామేజ్ అయ్యిందని స్థానికులు ఫిర్యాదు చేయగా సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రూ.33 లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు రాజాసుందర్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన



బేగంపేట్, నవంబర్ 18: సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో కార్తికమాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలోని వీరభద్ర స్వామి దేవాలయంలో శివుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ ఈవో మనోహర్‌రెడ్డి తోపాటు భారీగా పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

మలక్‌పేట, నవంబర్ 18: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చాదర్‌ఘాట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చాదర్‌ఘాట్ లోని లారీల అడ్డావద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గమనించిన స్థానికులు సోమవారం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి సిబ్బందితో చేరుకున్న ఎస్ఐ రవిరాజ్ మృతదేహాన్ని పరిశీలించగా, 35-40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందని, వారం రోజులక్రితం చనిపోయి ఉంటాడని భావిస్తున్నామని, మరణానికి గల కారణాలు పోస్టుమార్టం నివేదిక వస్తేగాని చెప్పలేమని ఎస్ఐ రవిరాజ్ తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీపీ బ్రౌన్‌కు ఘన నివాళి

సీపీ బ్రౌన్ చిత్రపటానికి నివాళులర్పించిన సీనియర్ పాత్రికేయుడు జయసూర్య

ముషీరాబాద్, నవబర్ 18: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా సోమవారం ఆంధ్ర భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు జయసూర్య ముఖ్యఅతిథిగా పాల్గొని బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాతృభాష ఆంగ్లం అయినప్పటికీ బ్రిటిష్ అధికారిగా తెలుగు నేలపై విధులు నిర్వహిస్తున్న సందర్భంగా బ్రౌన్ తెలుగు భాషపై ఆసక్తిని పెంచుకున్నారని అన్నారు. దీంతో భాషా అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుదిబండ వెంకటరెడ్డి, శ్రీమణి, టి.చక్రపాణి, పి.షహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా సీఎం రిలీఫ్ ఫండ్


క్యాంప్ కార్యాలయంలో రాజయ్య కుటుంబ సభ్యులకు ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

మారేడ్‌పల్లి, నవంబర్ 18: ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బోయిన్‌పల్లికి చెందిన రాజయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకోలేని పరిస్థితిలో ఉండడంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు సమస్యను వివరించారు. స్పందించిన ఆయన జిల్లా మంత్రి సహకారంతో సీఎం సహాయ నిధికి సిఫార్సు చేశారు. మంజూరైన రూ.2 లక్షల 50వేల ఎల్వోసీ పత్రాన్ని సోమవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

అవగాహన లేకపోవడంతోనే ప్రమాదాలు

ట్రాఫిక్ అడిషినల్ కమిషనర్ విశ్వప్రసాద్

టాఫిక్ వలంటీర్లకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ట్రాఫిక్ అడిషినల్ కమిషనర్ విశ్వప్రసాద్

బేగంపేట్, నవంబర్ 18: ట్రాఫిక్ నిబంధనలపై చాలా మంది వాహనదారులకు అవగాహన లేకపోవడం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయని నగర ట్రాఫిక్ అడిషినల్ కమిషనర్ విశ్వప్రసాద్ అన్నారు. సోమవారం బేగంపేట్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో 250 మంది ట్రాఫిక్ ఉల్లంఘన దారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ట్రాఫిక్ నిబంధలనపై చైతన్యం కల్పించారు. ఉత్తర మండల ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజ్ నేత్వత్వంలో జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ వి.రాంచందర్, బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అడిషినల్ కమిషనర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ మద్యం సేవించి ఎట్టి పరిస్థితిల్లోనూ వాహనాలు నడపరాదని ఆయన సూచించారు. నగరంలో ప్రతి సిటిజన్ ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఈ సందర్భంగా కోరారు. అలా పాటిస్తే రోడ్డు ప్రమాదాలు 90 శాతం నివారించవచ్చునని చెప్పారు. ఆటో డ్రైవర్స్, ఆర్టీసీ బస్సు డ్రైవర్స్ కూడా నిబంధనలు పాటించడం లేదని వారు కూడా ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీఐ సెంటర్ సిబ్బంది కృష్ణ, హీరో మోటార్స్ కార్ప్ సిబ్బంది సాదిక్, సాగర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబర్ 18: సైఫాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతు, ట్రీ కటింగ్ కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ వినోద్ కుమార్ ఒక ప్రకటన తెలిపారు. జెడ్పీ ఆఫీస్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరస్వతి శిశుమందిర్, పీటీ, వీఆర్ కాలనీ, అనంద్‌నగర్, ఇంద్రాలోక్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎర్రమంజిల్ సబ్ స్టేషన్ పరిధిలో పద్మావతినగర్, భగత్‌సింగ్ విగ్రహం, పద్మావతినగర్ శివాజీ విగ్రమం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు హైదర్‌గూడ సబ్ స్టేషన్ పరిధిలో కింగ్ కోటీ హాస్పిటల్, సెంట్ జోసెఫ్ రోడ్స్‌లో ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, విఠల్‌వాడి సబ్‌స్టేషన్ పరిధిలో తాజ్‌మహల్ రోడ్, కింగ్ కోటీ చౌరస్తా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, విఠల్‌వాడి సబ్‌స్టేషన్ పరిధిలోని బొగ్గుల కుంట వాటర్ వర్క్స్ ఏరియా, కామినేని హాస్పిటల్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు, నిజాం కాలేజీ సబ్‌స్టేషన్ పరిధిలోని సంతోస్ స్వప్న టాకీస్, అబిడ్స్ మెయిన్ రోడ్స్, శాంతాబాయి నర్సింగ్ హోమ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

వాటర్ ప్రూఫింగ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట, నవంబర్ 18: మెట్టుగూడ విజయపురికాలనీలోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో జరుగుతున్న వాటర్ ప్రూఫింగ్ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆమె అధికారులకు సూచించారు. అంతేకాకుండా విజయపురి కాలనీలోని నాలా పరివాహక ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిరకాల చర్యలను తీసుకోవాలని ఆమె అధికారులను కోరారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

హిమాయత్‌నగర్, నవంబర్18: చిరు ధాన్యాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని పద్మశ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ ఖాదర్ వలీ, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ చీఫ్ ప్యాట్రన్ మణికొండ వేద కుమార్ అన్నారు. 'పురాతన ధాన్యం, చిరు ధాన్యాల పునరాగమనం' అంశంపై సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ ఆవరణలో అవగాహన సదస్సు జరిగింది. చిరు ధాన్యాల్లో పిండి పదార్థంతో పాటు ప్రోటీన్లు, పీచు పదార్థం, ఇనుము, క్యాల్షియం, జింకు వంటి సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయని, కొర్రలు, ఊదలు, సామలు, అరికలు, సజ్జలు, రాగులు, వరిగలు, వరి, గోధుమలను వినియోగించుకోవడంతో ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం కల్గుతుందన్నారు. డాక్టర్ సముద్రాల మారయ్య మణెమ్మ సేవా ట్రస్ట్ ప్రతినిధి ఎస్.ధనుంజయ ముద్రించిన 'సిరి జీవన విధా నం, శాస్త్రీయం-కళాత్మకం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ప్రజల జీవనోపాధిని రక్షించాలి

26న జరిగే నిరసనను జయప్రదం చేయాలి

అభివాదం చేస్తున్న జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

చిక్కడపల్లి, నవంబర్ 18: రైతు, కార్మిక, ప్రజల జీవనోపాధిని రక్షించాలని, ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ 26న నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పశ్య పద్మ, టి.సాగర్, వేములపల్లి వెంకటరమణ, భూపాల్ మాట్లాడారు. కేంద్ర పాలకుల కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల వల్ల దేశ ప్రజలు, రైతులు, కార్మికులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో త్రీవంగా నష్టపోతున్నారని తెలిపారు. అన్ని పంటల ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం కలిపి మద్దతు ధరలను ప్రకటిచాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్ద చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 26న జరిగే నిరసన కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యుసూఫ్, నాగన్నగౌడ్, ఎస్ఎల్ పద్మ, శివబాబు, మూడ్ శోభన్‌నాయక్, హేమంత్‌రావు, కచ్చెల రంగారెడ్డి, విస్సా కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'పదవి మీద ధ్యాస తప్ప అభివృద్ధిపై లేదు'

బొల్లారం, నవంబర్ 18: కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ తమ పదవి కాపాడుకోవడానికే ఢిల్లీకి వెళ్లి రావడం తప్ప, కంటోన్మెంట్‌కు ఆయన చేసిందేమి లేదని కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శాంసన్ రాజ్ అన్నారు. సోమవారం అన్నానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని, ఇందులో బీజేపీ నాయకుల ప్రమేయం ఏమీ లేదని వెల్లడించారు. రామకృష్ణకు పదవిపై ఉన్న ధ్యాస కంటోన్మెంట్ అభివృద్ధిపై లేదని విమర్శించారు. ఈ సమావేశంలో మురళి, యాదగిరి, ధర్మేందర్, అంజనేయులు, నాగరాజు, ఇటుక గోపి తదితరులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యల పరిష్కారానికి కృషి

జూబ్లీహిల్స్, నవంబర్ 18 : విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుండా దృష్టి, వినికిడి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సికింద్రాబాద్ జీపీఎస్, బాలమ్రాయి.. జీబీహెచ్ఎస్, నల్లగుట్ట బాలమ్రాయిలలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో 'మా ఈఎన్‌టీ హాస్పటల్' సహకారంతో విద్యార్థులకు ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 200 మంది విద్యార్థులకు స్క్రీనింగ్‌లు నిర్వహించి అవసరమైన వారికి ఆడియోమెట్రీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ రొటేరియన్లు, దవాఖాన వైద్య నిపుణులు పాల్గొన్నారు.